క్లుప్తంగా

టీడీపీ నాయకులు హైడ్రామా


రైతులతో చర్చిస్తున్న ఆర్డీఓ

వి.కోట: రైతులతో చర్చించడానికి ఆర్డీఓ వస్తున్నట్లు తెలుసుకున్న టీడీపీ నాయకులు హైడ్రామాకు తెరదీశారు. పెద్దసంఖ్యలో తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని బైపాస్ వి.కోటకు పడమర వైపు వద్దు..తూర్పు వైపే కావాలంటూ నినాదాలు చేశారు. అయితే ఆర్డీఓ ఏం చెప్పదలచుకున్నారో లిఖితపూర్వకంగా ఇస్తే ఉన్నతాధికారులతో చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటామనడంతో వినతి పత్రం ఇచ్చి వెనుదిరిగారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కల్లూరు విద్యార్థి


సమీర్

పులిచెర్ల(కల్లూరు): రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు కల్లూరు వీఆర్ఆర్ కళాశాలకు చెందిన సమీర్ ఎంపికయ్యాడని కరస్పాండెంట్ సురేష్‌బాబు తెలిపారు. డిసెంబర్ 9, 10వ తేదీలలో బాపట్లలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో చిత్తూరు జిల్లా జట్టు తరఫున అతడు ప్రాతినిధ్యం వహిస్తున్నట్టు చెప్పారు. లయన్స్ క్లబ్ జిల్లా క్రీడా విభాగం అధ్యక్షుడు మహమ్మదాలీ సమీర్‌ను అభినందించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పెద్దపంజాణి: అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఎస్‌ఐ సిబ్బందితో కలసి కర్ణాటక సరిహద్దులోని రాజుపల్లెలో వాహనాలు తనిఖీ చేశారు. ఆ సమయంలో అటు వైపు వచ్చిన మండలంలోని కరసనపల్లెకు చెందిన శివరాజు వద్ద బ్యాగును పరిశీలించగా 90ఎంఎల్ ఒరిజినల్ చాయిస్ 96 టెట్రా ప్యాకెట్లు ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని తురకపేట, ముప్పిరెడ్డిగారిపల్లె అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలను గురువారం ఎస్ఎస్ అసిస్టెంట్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ వెంకట రమణారెడ్డి తనిఖీ చేశారు. చిన్నపిల్లలకు అందుతున్న పౌష్టికాహారం, నాడు–నేడు పనులను పరిశీలించారు. నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓలు సిద్దరామయ్య, తాతయ్య పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



రొంపిచెర్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 29 మంది వృద్ధులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు చేసినట్లు డాక్టర్ దినేశ్‌కుమార్ నాయక్ తెలిపారు. జగనన్న కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా చెన్నై జాకనీ నటరాజన్ నేత్రాలయ ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించామన్నారు. 21 మందికి వైద్య పరీక్షలు చేసి ఆరుగురిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారని, 11న చెన్నైలో వారికి ఆపరేషన్లు నిర్వహించి తిరిగి స్వగ్రామాలకు తరలిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ ఆంజనేయులు, నరసింహులు, మండల ఆరోగ్య విద్యాధికారిణి రాజేశ్వరి, సీహెచ్‌ఓ కాంతమ్మ, సూపర్‌వైజర్ పంకజ పాల్గొన్నారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్ట్

సదుం: ముగ్గురు కోడిపందెం రాయుళ్లను అరెస్టు చేసి వారి నుంచి రూ.6,650 స్వాధీనం ఎస్‌ఐ మారుతి తెలిపారు. ఊటుపల్లె పంచాయతీ చల్లావారిపల్లె సమీపంలో కోడిపందాలు నిర్వహిస్తున్నట్టు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేసినట్టు ఆయన చెప్పారు.

17న చిత్తూరులో కార్తీక వన మహోత్సవం



పలమనేరు: జిల్లా గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 17న ఆదివారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించ తలపెట్టిన కార్తీకవన మహోత్సవాన్ని జిల్లాలోని గాండ్ల కులస్తులు జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షులు భూపేష్ గోపీనాథ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద దీనికి సంబంధించిన పోస్టర్లను సంఘ నేతలు గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. కులసభ్యుల మధ్య ఐకత్యకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. సమావేశంలో సంఘ జిల్లా నేతలు టీకే షణ్ముగం, గిరి, కోదండరామయ్య, కుమార్, గిరి, రామ్మూర్తి, మునిరాజ్, కేశవులు, గురుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోడ కూల్చివేతపై ఫిర్యాదు

రామకుప్పం: స్థానిక బాలికల జెడ్పీ హైస్కూల్ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం ఆదివారం ఉద్రిక్తల నడుమ సాగింది. అయితే మంగళవారం రాత్రి ఆగంతకులు నిర్మాణంలో ఉన్న ప్రహరీ గోడను కూల్చివేశారని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధాకృష్ణ రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న చైర్మన్


పుంగనూరు: సుగాలిమిట్టలో బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న నాయకులు, సుగాలీ మహిళలు

పుంగనూరు: ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఇది ప్రజల ప్రభుత్వమని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా అన్నారు. గురువారం తేరువీధి సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులలో పార్టీ జెండాలు ఎగురవేశారు. మా నమ్మకం నువ్వే జగన్ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఇంటింటికి వెళ్లి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. చైర్మన్ మాట్లాడుతూ, పుంగనూరులో అర్హులందరికీ ఇళ్ల పట్టాలు, పెన్షన్లు, రేషన్ కార్డులు మొదలైన వాటితోపాటు వివిధ పథకాల ఫలాలు అందజేశామన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రాబోవు ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీని ఆశీర్వదింఆచలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ సీఆర్.లలిత, కౌన్సిలర్లు పూలత్యాగరాజు, కొండవీటి గంగులమ్మ, కన్వీనర్ వరదారెడ్డి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సుగాలిమిట్టలో..

సుగాలిమిట్ట సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి నిర్వహించారు. సచివాలయాల కన్వీనర్ రాజశేఖరరెడ్డితో కలసి డిజిటల్ బోర్డులు ఆవిష్కరించి, వైఎస్సార్ సీపీ జెండాలు ఎగురవేశారు. మా నమ్మకం నువ్వే జగన్ బుక్‌లెట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ లక్ష్మీదేవి, పార్టీ నాయకులు జయరామిరెడ్డి, రాజునాయక్, ప్రభాకర్‌నాయక్, శ్రీనివాసులు నాయక్, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: పేదలకు సంక్షేమ పథకాలు గ్రామ సచివాలయాల ద్వారా అందేలా చూడాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అన్నారు. గురువారం ఆయన బొమ్మయ్యగారిపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మాట్లాడారు. అలాగే చెరువుకింద దళితవాడకు చెందిన సుబ్బయ్య, లక్ష్మీదేవిల కుమార్తె జ్యోతికి కళ్యాణమస్తు పథకం కింద ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర రెడ్డి, ఎంపీడీఓ రాజేంద్ర, డీటీ వెంకటరమణారెడ్డి, వైస్ ఎంపీపీ విజయశేఖర్, పార్టీ మండల కన్వీనర్ ఇబ్రహీంఖాన్, బీసీ సెల్ అధ్యక్షుడు కోట వెంకటరమణ, నాయకులు చిన్న నాగరాజ, లక్ష్మయ్య, కరీముల్లా, సైపుల్లా ఖాన్, ఇజాద్ బాషా పాల్గొన్నారు.

ముదరందొడ్డిలో..

వి.కోట: గతంలో చంద్రబాబు పాలనకు, ప్రస్తుతం జగనన్న సంక్షేమ పాలనకు మధ్య తేడాలను గ్రహించి వైఎస్సార్‌సీపీని మరోసారిఆశీర్వదించాలని ఎంపీపీ యువరాజు కోరారు. గురువారం మండలంలోని ముదరందొడ్డి పంచాయతీ గ్రామ సచివాలయ పరిధిలో వైస్ ఎంపీపీ లక్ష్మణ్ రెడ్డి, సర్పంచ్ దామోదరం ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముదరందొడ్డి–1 సచివాలయం పరిధిలో ప్రభుత్వం రూ38.58 కోట్లను అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వ్యయం చేసిందన్నారు. తొలుత పార్టీ జెండా, అభివృద్ధి సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. వైస్ ఎంపీపీలు లక్ష్మణ్‌రెడ్డి, డాక్టర్ తమీమ్, బీసీ సెల్ అధ్యక్షుడు భూపతి, మండల సచివాలయాల కన్వీనర్ కిషోర్, పంచాయతీ కన్వీనర్ రాధాకృష్ణ, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సేట్, నాయకులు బాబు, సచివాలయ అధికారులు, గృహసారథులు పాల్గొన్నారు.

గుడ్లనాయనపల్లెలో..

కుప్పం రూరల్: కుప్పం మండలం గుడ్లనాయనపల్లెలో గురువారం జగనే ఎందుకు కావాలంటే..? కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ పరంగా ఆయా కుటుంబాలు పొందిన సంక్షేమ పథకాల లబ్ధి గురించి బుక్‌లెట్లతో వివరించారు. ప్రభుత్వం పనితీరుపై ప్రజాభిప్రాయం సేకరించారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ రంజిత్, వలంటీర్ గణపతి పాల్గొన్నారు.




రొంపిచెర్ల: కళ్యాణమస్తు చెక్కును పంపిణీ చేస్తున్న ఎంపీపీ, వి.కోట: సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, కుప్పం రూరల్: ప్రజాభిప్రాయం సేకరణ

స్వామియే శరణం అయ్యప్పా


అయ్యప్పస్వామిని దర్శించుకుంటున్న మంత్రి పెద్దిరెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తదితరులు

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె కోటమలై అయ్యప్పస్వామి ఆలయాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం సందర్శించారు. తిరుపతి కపిలతీర్థంలో అయ్యప్ప మాలధారణ చేసిన మంత్రి, అనంతరం స్వామి వారి దర్శనానికి విచ్చేశారు. ఆలయంలోని వినాయక, ఆంజనేయ, నాగమల్లేశ్వరస్వామి, నవగ్రహ ఆలయాల్లో పూజలు చేశారు. అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేయించారు. పలువురు తమ సమస్యల పరిష్కారానికి మంత్రికి వినతిపత్రాలు అందజేశారు. ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, జానపద కళల అకాడమీ చైర్మన్ కొండవీటి నాగభూషణం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా చలపతి, ఎంపీపీ ఎల్లప్ప, పుత్రాజు, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించరూ!

- మంత్రి పెద్దిరెడ్డికి విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల వినతి


మంత్రిని గజమాలతో సత్కరిస్తున్న కార్మికులు

కుప్పం: రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఉద్యోగులు వినతిపత్రం ఇచ్చారు. 25 ఏళ్లు విద్యుత్ రంగంలోని జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్ట్రిబ్యూషన్ కంపెనీలలో పనిచేస్తున్న కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. విధి నిర్వహణలో కొన్ని పర్యాయాలు తీవ్రగాయాలపాలై అంగ వైకల్యం బారిన పడుతున్నా ప్రాణాలు తెగించి పనిచేస్తున్నారన్నారు. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి విద్యుత్ శాఖ కార్మికులుగా గుర్తిస్తూ యాజమాన్యమే నేరుగా జీతాలు ఇవ్వాలని, విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు, గాయపడిన వారికి పర్మినెంట్ ఉద్యోగుల సమానంగా నష్టపరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

మంజునాథ్ కన్వెన్షన్ హాల్ ప్రారంభం


మంజునాథ్ కన్వెన్షన్ హాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, పక్కన ఎమ్మెల్సీ భరత్

కుప్పం: రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నందకుమార్ నిర్మించిన మంజునాథ్ కన్వెన్షన్ హాల్‌ను గురువారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎమ్మెల్సీ భరత్, రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, అన్ని మండలాల ఎంపీపీ, జెడ్పీటీసీలు, పార్టీ మండల కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధం

- పలమనేరు ఆర్డీఓ మనోజ్‌కుమార్ రెడ్డి


ఓటర్ల నమోదుపై నిర్వహిస్తున్న అవగాహనర్యాలీ

పలమనేరు: ప్రజాస్వామ్యంలో ఓటే ఒక బలమైన ఆయుధమని, 18 ఏళ్లు నిండిన వారు ఓటర్లుగా నమోదై ఓటుహక్కును వినియోగించుకోవాలని పలమనేరు ఆర్డీఓ మనోజ్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. ఓటరు నమోదుపై గురువారం స్థానిక రెవెన్యూశాఖ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించింది. ఆర్డీఓ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య భారతదేశంలో వయోజనులందరికీ ఓటు హక్కు ఉండడం గొప్ప విషయమన్నారు. ప్రపంచంలోని పలు దేశాల్లో వర్ణ, విద్య, ధన, లింగ తదితర ప్రాతిపదికలతోనే ఓటు హక్కు ఉందనేది గుర్తెరగాలన్నారు. ఓటరుగా గుర్తింపుబడిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకున్నప్పుడే దానికి విలువ ఉంటుందన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఎంత ముఖ్యమో ఓట్లు అంతే కీలకమైనవన్నారు. గతంలోలా కాకుండా ఆన్‌లైన్, మీ–సేవల్లోనూ ఓటర్లుగా నమోదు కావచ్చన్నారు. 18 ఏళ్లు నిండిన వయోజనులు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే వరకు ఓటరుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇదొక నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కుప్పుస్వామి, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మీకు తోడుగా ఉంటాం


సారె పంపిణీ చేస్తున్న దుర్గ, నాయకులు

కుప్పం రూరల్: కుప్పం ఎమ్మెల్యేగా భరత్‌ను గెలిపిస్తే కష్టాల్లో మీకు తోడుగా ఉంటామని ఎమ్మెల్సీ భరత్ భార్య దుర్గ అన్నారు. గురువారం కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీలో ఆమె ఇంటింటికీ వెళ్లారు. పసుపు, కుంకుమ, చీర, గాజులు ఇచ్చి మాట్లాడారు. చంద్రబాబును ఇన్నేళ్లుగా గెలిపించినా ఆయన ఏరోజూ కుప్పంలో నివాసం ఉండలేదని, తెలంగాణ రాష్ట్రంలో ఉంటూ స్థానికుల సాధక బాధలను పంచుకోలేదని విమర్శించారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో కూడా ఆయన ముఖం చాటేశారని, తమ కుటుంబం ప్రజలకు అండగా నిలిచిందన్నారు. నిత్యం ప్రజలకు భరత్ ప్రజలకు అందుబాటులో ఉంటూ తన దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. దీనిని కుప్పం ప్రజానీకం గుర్తెరిగి ఎవరు మేలు చేస్తున్నారో వారికే ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

సదుం: మండలంలోని గొడ్లవారిపల్లె, ఎర్రాతివారిపల్లె, బూరగమందలో ఈవీఎంలు, వీవీ ప్యాట్లపై అవగాహన కల్పించినట్టు తహసీల్దార్ చంద్రశేఖర్ గురువారం తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో వాటిని వినియోగించే విధానంపై గ్రామస్తులకు వివరంగా తెలియజేసినట్టు చెప్పారు. అలాగే మాక్ పోలింగ్ నిర్వహించామన్నారు. సర్పంచ్ వెంకటరమణ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సోమలలో..

సోమల: రాబోవు ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఈవీఎంలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీటీ రామ్మూర్తి అన్నారు. గురువారం స్థానిక ఉన్నత పాఠశాలలో ప్రజలు, రాజకీయ పార్టీ నేతలకు ఈవీఎంలపై అవగాహన కల్పించారు. సింగిల్‌విండో చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరావు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ గంగాధరం, వైస్ ఎంపీపీ ప్రభాకర, మాజీ సర్పంచ్ శ్రీరాములు, షేక్‌బాషా, ఐలా సురేంద్ర, బీఎల్‌ఓలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



పలమనేరు: మండలంలోని అయ్యంరెడ్డిపల్లె, ఎస్ఆర్‌పురం, సంబార్‌పూర్ ప్రాథమిక పాఠశాలలోని వందమంది పిల్లలకు దండపల్లి క్రిష్ణప్ప వర్ధంతి పురస్కరించుకుని ఆయన కుమారులు రామమూర్తి, గురుమూర్తి, జగదీశ్వర్ గురువారం విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఆయా స్కూళ్ల హెచ్ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు

శాంతిపురం: మేజర్ పంచాయతీ కేంద్రమైన రాళ్లబూదుగూరులో నూతనంగా నిర్మించిన ఊరి గంగమాంబ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు గురువారం ప్రారంభమయ్యాయి. గణపతి హోమం, కలశ స్థాపన, అష్టబంధన పూజలను లక్ష్మీకాంతస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం ఉదయం అమ్మవారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన, నాడీ సంధానం, అభిషేకం, అలంకరణ, అన్న ప్రసాద వితరణలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

'పోషణ్ అభియాన్' సద్వినియోగం చేసుకోండి



కుప్పం రూరల్: పోషణ్ అభియాన్ పథకం కింద గర్భవతులు, బాలింతలకు ప్రభుత్వం పౌష్టికాహారం ఇస్తోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దిల్‌షాద్ కోరారు. గురువారం కుప్పంలోని రామ్‌నగర్ అంగన్‌వాడి కేంద్రంలో సాక్షి అంగన్‌వాడి– పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. పథకంలో గర్భవతులు, బాలింతలకు 3 కిలోల బియ్యం, కిలో పప్పు, నూనె అరలీటర్, గుడ్లు 13 పంపిణీ చేశారు. కార్యకర్త కాంచనాదేవి, హెల్పర్ రాధ పాల్గొన్నారు.

బొలెరో ఢీకొని దంపతులకు తీవ్రగాయాలు


గాయపడిన బాలక్రిష్ణ

గంగవరం: బొలెరో ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంపతులు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. కలగటూరుకు చెందిన బాలక్రిష్ణ(బుజ్జి)(38) చేపల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం తన భార్య జానకి(36)తో ద్విచక్ర వాహనంలో పుంగనూరు వైపు నుంచి తమ గ్రామానికి వెళ్తూ అప్పినపల్లె క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి వస్తున్న బొలెరో వారిని ఢీకొంది. ఈ ప్రమాదంలో దంపతుకు తీవ్రగాయాలయ్యాయి. బాలక్రిష్ణ పరిస్థితి విషమంగా మారింది. స్థానికుల సహాయంతో ఇద్దరినీ చికిత్స నిమిత్తం పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి రెఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

సదుం: మూడు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి వైర్లను చోరీ చేసిన సంఘటన మండలంలో గురువారం వెలుగులోకి వచ్చింది. వివరాలు..రెడ్డివారిపల్లెకు చెందిన నాగరాజు, గుండ్లూరువారిపల్లెకు చెందిన తిరుమలేశ్, కంభంవారిపల్లె క్రాస్ సమీపంలో ఏఎంసీ వైస్ చైర్మన్ శివారెడ్డి పొలం వద్ద మూడు 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. బుధవారం రాత్రి వీటిని దొంగలు ధ్వంసం చేసి చోరీకి పాల్పడ్డారు. గురువారం పొలాల వద్ద వెళ్లి రైతులకు దీనిని గుర్తించి ట్రాన్స్‌కో ఏడీఈ నరేంద్ర దృష్టికి తీసుకెళ్లారు.

పేదలందరికీ సంక్షేమ ఫలాలు

- వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా ప్రత్యేక అధికారి సచీంద్ర పట్నాయక్


స్టాల్స్‌ను పరిశీలిస్తున్న సుచీంద్ర పట్నాయక్

సదుం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని వికసిత్ భారత్ సంకల్పయాత్ర జిల్లా ప్రత్యేకాధికారి సచీంద్ర పట్నాయక్ అన్నారు. మండలంలోని నడిగడ్డలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నాయన్నారు. పేదల అభ్యున్నతికి కేంద్రం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, వివిధ పథకాలపై అవగాహనకే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విజయవంతం చేయడం సంతోషదాయకమన్నారు. పలువురు తాము పొందిన ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి గురించి తెలియజేశారు. అనంతరం హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన పరిశీలించి వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత స్థానిక సచివాలయాన్ని పరిశీలించారు. వాటి ద్వారా అందిస్తున్న సేవలు, సిబ్బంది వివరాలు అధికారులు ఆయనకు వివరించారు. సచివాలయ వ్యవస్థ తీరును ఆయన అభినందించారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీపీఓ లక్ష్మి, డీడీ రాజ్యలక్ష్మి, జిల్లా ఏఓ మురళీకృష్ణారెడ్డి, సర్పంచ్ నారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, వైస్ ఎంపీపీ అమరావతి తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరీసా విద్యార్థుల ఉత్తమ ప్రదర్శన



పెద్దపంజాణి: ఇటీవల మదనపల్లె బీటీ కళాశాలలో జరిగిన మహాకార్య సంగీత పోటీలలో తమ విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన చేసినట్లు మదర్ థెరీసా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎం.రవీంద్రబాబు గురువారం తెలిపారు. దాదాపు 170 మంది పాల్గొన్న ఈ పోటీలో తమ పాఠశాల తరఫున బాలబాలికలు 27 మంది పాల్గొన్నారన్నారు. జూనియర్, సబ్ జూనియర్ కేటగిరీలలో మొదటి బహుమతులు 5, రెండవ బహుమతులు 6, మూడవ బహుమతులు 5తో పాటు పతకాలు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు తెలిపారు.

పంటలను పరిశీలించిన అధికారులు



ఆవులపల్లె వద్ద వరి పంటను పరిశీలిస్తున్న ఏరువాక శాస్త్రవేత్తలు, ఏఓ, సదుం మండలంలో..

సోమల: తుపాను ప్రభావం మూలాన మండలంలో దెబ్బతిన్న పంటలను ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త, సమన్వయకర్త రెడ్డి రాము గురువారం పరిశీలించారు. ఆవులపల్లె, నంజంపేట, దిడ్డివారిపల్లె, సోమల సచివాలయాల పరిధిలో పంటలను స్థానిక వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. నీట మునిగిన వరి పొలాల్లో కాలువలు తీసి నీటిని బయటకు వదిలివేయాలని, కోత దశలో ఉన్న పొలాల్లో ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. పిచికారీ చేసుకోవడానికి వీలు కాకపోతే ఎకరాకు 25 కేజీల రాళ్ల ఉప్పును పొలంపై వెదజల్లితే గింజలు మొలక వచ్చే అవకాశాన్ని తగ్గించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మోహన్ రెడ్డి, విశ్వనాథ, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది సుబ్రమణ్యం, వనజ, మునిజ్యోతి, రాధిక పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: తుపాను ప్రభావం వలన మండలంలో దెబ్బతిన్న వరి పంటను జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణారెడ్డి గురువారం పరిశీలించారు. ఇందిరానగర్ తాండా, కుమారొడ్డుని చెరువు ప్రాంతాల్లో వరిపంట పరిశీలించారు. దెబ్బతిన్న పంట పొలాల్లో జాగ్రత్తగా నూర్పిళ్లు చేయాలని చెప్పారు. పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు. ఆర్‌బీకే సిబ్బందితో సేవలపై సమీక్షించారు. ఏఓ సుధాకర్ పాల్గొన్నారు.


రొంపిచెర్ల : బోడిపాటివారిపల్లెలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారులు

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: కరువు ప్రభావిత ప్రాంతమైన రొంపిచెర్ల మండలంలో జిల్లా వ్యవసాయశాఖ పథక సంచాలకులు మురళీకృష్ణ గురువారం పర్యటించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన వేరుశనగ పంట తీవ్ర వర్షాభావంతో ఎండిపోవడంతో ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించడం విదితమే. ఈ నేపథ్యంలో గానుగ చింత, బోడిపాటివారిపల్లెలో అధికారులు పర్యటించారు. పంటల స్థితిగతుల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. పంట పూర్తిగా దెబ్బతిందని, తమని ఆదుకోవాలని వేరుశనగ సాగు చేసిన రైతులు వారిని కోరారు. కార్యక్రమంలో ఏడీఏలు శివకుమార్, నాగపద్మిని, లక్ష్మీప్రసన్న, ఏఓ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

యువతకు క్రీడలూ అవసరమే


క్రీడా కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ వరలక్ష్మి


పలమనేరు : క్రీడా వస్తువుల పంపిణీ

గుడుపల్లె: యువతకు క్రీడలు కూడా అవసరమేనని ఎంపీపీ వరలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 18 గ్రామ పంచాయతీలకు క్రీడా కిట్లలను పంపిణీ చేసి ఆమె మాట్లాడారు. క్రీడల్లో యువతను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆడుదాం ఆంధ్రా క్రీడలకు సీఎం శ్రీకారం చుట్టారని, వచ్చే వారం నుంచి గ్రామాలలో క్రీడలను నిర్వహిస్తామన్నారు. యువత దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీఓ తాజ్ మస్రూర్, ఈఓపిఆర్‌డి శంకర్ పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో ప్రభుత్వం అందజేసిన క్రీడా వస్తువులను స్కూళ్ల హెచ్ఎంలకు గురువారం స్థానిక ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం పంపిణీ చేశారు. వాలీబాల్, త్రోబాల్, షాట్‌పుట్, పుట్‌బాల్ తదితర క్రీడల్లో విద్యార్థులకు వీటిని వినియోగించేలా పీఈటీలు చూడాలన్నారు.

నర్సింగ్‌తో ఉపాధి అవకాశాలు పుష్కలం


పీఈఎస్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపల్

గుడుపల్లె: సమాజంలో నర్సింగ్ విద్యకు ఎంతో గౌరవం ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని సేవలతో అందరి మన్ననలు పొందాలని పీఈఎస్ కళాశాల ప్రిన్సిపల్ హెచ్ఆర్ క్రిష్ణారావు అన్నారు. గురువారం పీఈఎస్ ఆడిటోరియంలో నూతనంగా నర్సింగ్ విద్యార్థులు తరగతులను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి ఆయన మాట్లాడారు. నర్సింగ్ పూర్తి చేస్తే ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉంటాయని, కష్టపడి చదివిన ప్రతి విద్యార్థికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. నర్సులు రోగి సంరక్షణ సమయంలో వృత్తి ధర్మాన్ని పాటించాలన్నారు. అనంతరం పలువురు వైద్యులు నర్సింగ్ విలువలను తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుబ్రమణ్యం బిజీష్‌కుమార్ శ్రీదేవిలు పాల్గొన్నారు.